

తాగేందుకు నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

## సీతారాం తండాలో మూడు రోజులుగా నీళ్లు బంద్

### ఇబ్బందులుపడుతున్న ప్రజలు

**కొల్చారం, నవంబర్15 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సీతారాం తండా గ్రామ పంచాయితీలో గత మూడు రోజులుగా నీళ్ల రాకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్రాగేందుకు నీటిని రెండు కిలోమీటర్ల దూరం నుండి తెచ్చుకుంటున్నారు. గ్రామ కార్యదర్శి సదాశివ పది రోజులు రావడం లేదని, ఎంపీడీవో చర్యలు తీసుకోవాలని తండా వాసులు కోరుతున్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## అడవిపంది దాడిలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 15, ప్రభాతవార్త:** రామాయంపేటమండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామంలో వ్యవసాయం పనులు చేసుకుంటున్నవారిపై మంగళవాం అడవిపంది దాడిచేసి ఇద్దరు మహిళలను తీవ్రంగా గాయపర్చింది. బాధిత కుటీంబీకులు కథనం ప్రకారం..గ్రామానికి చెందిన కల్వల ముత్తవ్వ, కల్వల లక్ష్మి పొలం వద్ద పనులు చేస్తుండగా ఆకస్మాత్తుగా అడవిపందులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు తెలిపారు. అడవిపంది దాడిలో గాయాలైన మహిళలు కేకలు వేయగా చుట్టుపక్కల ఉన్నవారు ఘటన స్థలానికి వెళ్లి వారిని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించడం జరిగింది. విషయాన్ని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బాధిత కుటుంబీకులతో ఆమె ఫోన్లో మాట్లాడి పరామర్శించారు. అడవిపంది దాడిలో గాయాలైన మహిళలకు మెరుగైన చికిత్స అందించాలని గాంధీ ఆసుపత్రి సూపరిండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు వారు తెలిపారు. బాధితులకు తన వంతు సహాయం అందిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేష్

## విద్యార్థులు ఓటర్‌గా పేరు నమోదు చేసుకోవాలి

### -అదనపు కలెక్టర్ రమేష్

**మెదక్, నవంబర్ 15 ప్రభాతవార్త:**

18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ రమేష్ సూచించారు. మంగళవారం మెదక్ జిల్లా స్వీప్ ఆధ్వర్యంలో ఓటర్ నమోదు, ఆధార్ అనుసంధానంపై అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన విద్యార్థుల సమాచారం సేకరించి ఓటర్లుగా నమోదయ్యేటట్లు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు ఓటర్ హెల్ప్‌లైన్ ఆప్ ఎన్‌వీఎస్‌పీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో కూడా ఓటర్‌గా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి, ఇంటర్మీడియట్ నోడ్ అధికారి సత్యనారాయణ, జిల్లా ఎన్నికల సూపరింటిండెంట్ శ్రీనివాస్, కళాశాలల ప్రిన్సిపాళ్ల పాల్గొన్నారు.

## చిల్వర్ పాఠశాల అదనపు గదులకు రూ. 10 లక్షలు మంజూరు

**అల్లాదుర్గం, నవంబర్ 15, ప్రభాతవార్త:** మండలంలోని చిల్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదనపు గదుల నిర్మాణం కోసం పది లక్షల రూపాయలు మంజూరైనట్లు అల్లాదుర్గం జెడ్పిటీసీ దూదగొండ సౌందర్య తెలిపారు. పాఠశాలలో తరగతి గదుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారని, ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకువచ్చారని ఆమె తెలిపారు. విద్యార్థుల సమస్యలు గుర్తించి ఈ జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలకు అదనపు గదుల నిర్మాణంకోసం ప్రభుత్వ పరంగా 10 లక్షల రూపాయలు మంజూరు అయినట్లు తెలిపారు. ఇట్టి నిధులతో అదనపు గదుల నిర్మాణం పూర్తిఅయితే, విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ నిధులు మంజూరు చేయించుటకు సహకరించిన మంత్రి హరీష్ రావు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటీల్, అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జిల్లా పరిషత్ చైర్మన్ హేమలతశేఖర్ గౌడ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించాలి

### జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ



మాట్లాడుతున్న రోజాశర్మ

**చిన్నకోడూరు, నవంబర్ 15, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటీ రోజాశర్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కూర మాణిక్యరెడ్డి అధ్యక్షతన అయిల్‌ఫామ్ పంట సాగుపై రైతులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో అమె పాల్గొని మాట్లాడారు. సిఎం కెసిఅర్ అమలు చేస్తున్న పథకాలు దేశానికే అదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అయిల్‌ఫామ్ సాగుతో తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలు ఉన్నాయన్నారు. ఎకరం అయిల్ ఫామ్ సాగుచేస్తే 1.50 వేల అదాయం వస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులు అయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించాలన్నారు. రైతులకు సబ్సీడిపై డ్రిప్‌తో పాటు మొక్కలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు వంగ నాగిరెడ్డి, ఎఎంసి చైర్మన్ కొండం వనితిరవీందర్‌రెడ్డి, రైతు సమన్వయ మండల అధ్యక్షులు పరకాల మల్లేశంగౌడ్,జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు మేడికాయల వెంకటేశం, గంగాపూర్ సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసిని లాభాల బాటలో పయనింపచేయాలి

### హైదరాబాద్ జోన్ ఈడి పురుషోత్తం నాయక్

**జహీరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త:** నష్టాల్లో నడుస్తున్న ఆర్టీసిని లాభాల బాటలో పయనించేలా కార్మికులు తమ వంతు కృషి చేయాలని ఆర్టీసి హైద్రాబాద్ జోన్ ఈడి ఏ పురుషోత్తం నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసి డిపోన, బస్టాండ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో ఆర్టీసి కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పురుషోత్తంనాయక్ మాట్లాడుతూ గతంలో లాభాలతో పరుగులు తీసిన జహీరాబాద్ డిపో ప్రస్తుతం 3 కోట్ల నష్టాలతో పయనిస్తోందన్నారు. కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి వచ్చే బస్సుల్లో తెలంగాణ ప్రయాణీకులు ప్రయాణించడమే ప్రధాన కారణంగా పేర్కొన్నారు. ప్రయాణీకులు టిఎస్ ఆర్టీసిలో ప్రయాణించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కార్మికులకు సూచించారు. పాత బస్సుల స్థానంలో మార్చి మాసం వరకు 630 కొత్త సూపర్ లగ్జరీ బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సులను అందచేయనున్నట్లు ప్రకటించారు. కార్మికులకు రావాల్సిన డిఎ బకాయిలను పిఆర్‌సిని త్వరలోనే వెల్లడిస్తామని సంస్థ చైర్మన్ ప్రకటించినట్లు గుర్తు చేశారు. కార్మికుల కొరకు హైద్రాబాద్‌లోని తార్నాకలోఆధునిక వసతులతో ఆసుపత్రిని నూతనంగా ఆధునీకరించినట్లు పేర్కొన్నారు. రీజినల్ మేనేజర్ సుదర్శన్ మాట్లాడుతూ కార్మికులు, సిబ్బంది ప్రయాణీకులతో స్నేహపూర్వకంగా పలుకరించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ ఆర్ఎం జానకిరామ్, దేవానందం, డిపో మేనేజర్ రజని కృష్ణ, సిఐ శ్రీనివాస్, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు. విధి నిర్వాహణలోఉత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్, డ్రైవర్లకు శాలువాలతో సన్మానించి నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందచేశారు.



కార్మికులకు నగదు, ప్రశంసాపత్రాలు అందచేస్తున్న ఆర్టీసీ అధికారులు





మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో జ్యోతి వెలగిస్తున్న జడ్పీ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, హాజరైన జిల్లా ఉన్నతాకారులు, ప్రజాప్రతినిధులు

# సంగారెడ్డిలో మెడికల్ కళాశాల ప్రారంభం

**సంగారెడ్డి టౌన్, నవంబరు 15, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో నిర్మించిన మెడికల్ కళాశాల భవనాన్ని,తరగతులను మంగళవారం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా హైదరాబాద్ నుంచి సిఎం భవనం, తరగతులను ప్రారంభించారు.

కార్యక్రమంలో రాష్ట్ర చేనేత అభివృద్ది సంస్థ

### పాల్గొన్న జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

చైర్మన్, సంగారెడ్డి మజీ ఎమ్మెల్యే, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు చింత ప్రభా కర్, అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మిరవి, వైస్‌చైర్మన్ లతా విజయేం దర్‌రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివ కుమార్, డీసిసిబి చైర్మన్ చిట్టిదేవేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.నరహరిరెడ్డి, సిడిసి చైర్మన్ కాసాల బుచ్చి రెడ్డి, కౌన్సిలర్‌లు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.శరత్, ఎస్సీ ఎం.రమణకుమార్, అదనపు కలెక్టర్ రాజర్షి షా, ఆర్‌డిఓ మంచు నగేష్, తహసీల్దార్ విజయ్ కుమార్, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ అనిల్ కుమార్, డాక్టర్ల బృందం,అధ్యాపకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



నియామక ఉత్తర్వులను అందజేస్తున్న డీసీసీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

## కాంగ్రెస్ పార్టీ మైనారిటీ కమిటీల నియామకం

**మెదక్ మున్సిపాలిటీ, నవంబర్15 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని డీసీసీ కార్యాలయంలో మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా అహ్మద్, జిల్లా కార్యదర్శిగా తాహెర్, మైనారిటీ నియోజకవర్గ కన్వీనర్‌గా ఇస్మాయిల్‌లను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి, పీసీసీ మెంబర్ మామిళ్ల ఆంజనేయులు, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, గూడూరి ఆంజనేయులు, అవారి శేఖర్, శ్యాంసుందర్, ఆరిఫ్, సుఫీ, ఐతారం నర్సింలు, గోవింద్, శంకర్, మహేందర్‌రెడ్డి, భూపతి, అమీర్, మన్సూర్, నయీం, సంజీవ్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న అవులను పట్టుకున్న బీజేపీ నాయకులు

**వెల్దుర్తి, నవంబర్15 ప్రభాతవార్త:** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఆవులను తరలిస్తున్న ఓ వాహనాన్ని మాసాయిపేటలో మండల బీజేపీ అధ్యక్షులు పాపన్నగారి వేణుగోపాల్ అడ్డుకొని అందులోని రెండు ఆవులను కాపాడారు. మంగళవారం తూప్రాన్ మండలం గుండ్రెడిపల్లి గ్రామం నుండి ఓ టాటీ ఏసీ వాహనంలో రెండు ఆవులను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారనే సమాచారం వచ్చిందని, దీంతో మాసాయిపేట జాతీయ రహదారి 44 వద్ద మండల బీజేపీ అధ్యక్షులు వేణుగోపాల్‌తో పాటు పలువురు వచ్చి రహదారిపై వెళ్తున్న వాహనాన్ని నిలిపి తనిఖీ చేయడం జరిగిందన్నారు. అందులో రెండు ఆవులు ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకొని అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని, నిబంధనలను అతిక్రమిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అక్రమంగా తరలిస్తున్న ఆవులను పట్టుకున్న బీజేపీ నాయకులు



ములుగు ఫారెస్ట్ యూనివర్సిటీ

## ఎంఎస్‌సి ఫారెస్ట్రీ కోర్సులకు అడ్మిషన్స్ ప్రారంభం

**ములుగు, నవంబర్ 15 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థ 2022-23 సంవత్సరానికి ఎంఎస్‌సి ఫారెస్ట్రీ రెండు సంవత్సరాల డిగ్రీ కోర్సులో ప్రవేశానికి మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 16వ తేదీ నుండి దరఖాస్తు ఫారం కళాశాల వెబ్‌సైట్ డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.ఎఫ్‌సిఆర్‌ఐటిఎస్.ఇన్‌లో పొందుపర్చినట్లు డీన్ ప్రియాంకవర్గీస్ తెలిపారు. వెబ్‌సైట్‌లో పొందిపర్చిన దరఖాస్తుఫారంనింపి అందుకు కావాల్సిన సర్టిఫికెట్‌లను అప్‌లోడ్ చేసి రుసుము ఎస్సీ,ఎస్టీ,పిహెచ్ అభ్యర్థులు రూ. వెయ్యి, ఇతరులు రూ.2వేలు చెల్లించాల్సి ఉంటుందని, స్వీకరణ ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని కళాశాల అధికారులు తెలిపారు. ఆలస్యం అయిన వారికి ఈనెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రూ.500 ఆలస్య రుసుముతో స్వీకరించబడుతుందని తెలిపారు. అడ్మిషన్లు ఐసిఏఆర్-ఏఐఈఈఏ పిజి-2022 ప్రవేశ పరీక్ష 50 శాతం బిఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ 50 శాతం వెయిటేజీ అకాడమిక్ స్కోర్ యొక్క పనితీరుపై ఆధారపడి ఉంటాయని వారు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## సిఐటీయూ మహాసభలను విజయవంతం చేద్దాం

**కొండపాక, నవంబర్ 15, ప్రభాతవార్త:** సిద్దిపేటలో డిసెంబర్ 21 నుంచి 23 వరకు జరిగే సీఐటీయూ రాష్ట్ర నాల్గో మహాసభలను విజయవంతం చేద్దామని కోనాయిపల్లి గ్రామంలో మంగళవారం గోడపత్రికను అవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటీయూ మండల కార్యదర్శి అమ్ములు బాలనర్సయ్య మాట్లాడుతూ డిసెంబర్ 21న బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మర్కుక్ పోశయ్య, కర్ణాకర్, రాజయ్య, రవీంద్రచారి, కరుణాకర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాలు ఢీ... నలుగురికి గాయాలు

**మెదక్, నవంబరు 15, ప్రభాతవార్త:** ద్విచక్రవాహనాలు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామ శివారులో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... జంగరాయి పంచాయతీ పరిధి నాగులమ్మ తండాకు చెందిన సిద్ధు, మౌనిక దంపతులు గవ్వలపల్లి నుండి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఉప్పులింగాపూర్ నుండి గవ్వలపల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న కుమార్, ఆంజనేయుల ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. నలుగురికి తీవ్ర గాయాలుకాగా, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్సు వాహనం ద్వారా మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# సాగు భూములను లాక్కుంటున్నారని రైతుల ఆందోళన

**సంగారెడ్డి, నవంబరు 15, ప్రభాతవార్త:** మూడు తరాలుగా సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం బలవంతంగా గుంజుకుంటోందని ఆందోళన చెందిన రైతులు మండల కేంద్రంలో ధర్నాకు దిగిన సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గంలోని జిన్నారం మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. గ్రామంలోని 1వ సర్వే నంబర్‌లోని భూములకు పొజీషన్‌చేయించి పరిశ్రమలకు కేటాయించాలని నిర్ణయించడంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నాకు దిగారు. అఖిలపక్ష రాజకీయ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, బిజెపి బీసీ మోర్చ నాయకులు గడీల శ్రీకాంత్, ఎడ్ల రమేష్ రైతులకు మద్దతు ప్రకటించి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ గతంలో రైతులకు అసైన్డ్ భూములుగా కేటాయించిన భూములకు పొజిషన్ చూపించి మిగతా భూములను పరిశ్రమలకు కేటాయించాలని తహసీల్దార్ దశరథ్‌కు సూచించారు. రైతులకు కేటాయించిన 120ఎకరాల భూమి కాకుండా ప్రభుత్వ భూమినే పరిశ్రమలకు కేటాయించినట్లు నాయకులకు వివరించారు. రైతులకు పోజిషన్ చూపించాలని డిమాండ్ చేయడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

### మద్దతు ప్రకటించిన నాయకుల అరెస్టు

పరిశ్రమల కోసం పనులు కొనసాగుతన్న ప్రాంతానికి నాయకులు, రైతులు వెళ్లే ప్రయత్నం చేయడం డిఎస్‌పి భీమ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిఐ, ఎస్ఐ, సిబ్బంది నాయకులను అడ్డగించి బొల్లారం పోలీసు ఠాణాకు తరలించారు. ఈ సదర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులకు కేటాయించిన భూములను కార్పొరేట్ సంస్థలకు కోట్లకు అమ్ముకునేందుకు రైతుల నుంచి బలవంతంగా లాగుకోవడం తగదని హెచ్చరించారు. టిఆర్ఎస్ ప్రభుత్వానికి గద్దెదిగే రోజులు దగ్గర పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు రవీందర్ గౌడ్, వైస్ ఎంపిపి గంగూ రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు పొట్టి భాస్కర్, బిజెపి మండల అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, వడ్డే కృష్ణ, రాజిరెడ్డి, రైతులు నీల వెంకటేశ్, మొర బిక్షపతి, దోమడుగు శంకర్, మహిళా రైతులు పాల్గొన్నారు.





ఆందోళన చేస్తున్న రైతులు, మద్దతు తెలిపిన నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న అడిషనల్ డిసిపి అడ్మిన్ మహేందర్

## ర్యాగింగ్ ఒక విష సంస్కృతి

### అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** తల్లిదండ్రుల అశయాలను నెరవేర్చుందుకు 5 యేండ్ల డాక్టర్ కోర్సు పూర్తి చేసుకొని కాలేజీ నుంచి వెళ్లి మంచి డాక్టర్లుగా పేరు తెచ్చుకోవాలని అడిషలన్ డీసీపీ అడ్మిన్ సందెపొగు మహేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఫ్రెషర్స్ డే సందర్భంగా మంగళవారం ర్యాగింగ్ చట్టాలపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో అయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు డాక్టర్లను దేవుళ్లుగా భావిస్తారని వైద్య వృత్తిలో ఎంతో మంది డాక్టర్లు ప్రజల ప్రాణాలు కాపాడి మంచి పేరు తెచ్చుకుంటారని తెలిపారు. ర్యాగింగ్ చట్ట ప్రకారం నేరమని అందరూ అన్నదమ్ములవలే.. అక్క చెల్లుగా కలిసి విద్యను అభ్యసించాలన్నారు. ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ చట్టం యొక్క 1997 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ర్యాగింగ్ చట్టం ప్రకారం ఒకసారి కేసు నమోదైతే 6 నెలల నుంచి 3 యేండ్ల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. ర్యాగింగ్ ఒక విష సంస్కృతని అందరూ దూరంగా ఉండాలన్నారు. తెలిసి తెలియని వయస్సులో సిగరెట్, గుట్కా, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దన్నారు. ఉన్నత చదువులు చదివి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తెవాలన్నారు. స్త్రీలను గౌరవించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో పోలీసు శాఖ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా సేవలు అందిస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన వెంటనే 100 డయల్ చేయాలని లేదా పోలీసు కంట్రోల్ రూమ్ 8333998699 ఫోన్ చేస్తే సత్వరమే స ్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, కళాశాల ప్రిన్సిపల్ విమలథామస్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, సీనియర్ ఫ్యాకల్టీలు, మెడికల్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఢీకొని బాలుడి మృతి

**హత్నూర, నవంబరు 15, ప్రభాతవార్త:** హత్నూర మండలం దౌల్తాబాద్‌లో మంగళవారం తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మూడు సంవత్సరాల బాబును ట్రాక్టర్ ఢీకోట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన చూపరులను కంటతడిపెట్టించింది. హత్నూర పోలీసుల కథనం ప్రకారం హత్నూర మండలం మేజర్‌గ్రామపంచాయతీ దౌల్తాబాద్ గ్రామానికి చెందిన కె.నవీన్,మాలతీలకు ఇద్దరు కుమారులు ఉన్నారు.పెద్ద కుమారునికి స్కూల్‌కు పంపియడానికి ఇద్దరు కుమారులతో కలిసి మాలతీ ఇంటి నుండి బయలు దేరిందని అన్నారు. రోడ్డు దాటుతుండగా దౌలాపూర్ గ్రామాం నుండి దౌల్తాబాద్ బస్టాండ్ వైపు వడ్లలోడుతో వెళుతున్న ట్రాక్టర్ మాలతీ చిన్న కోడుకు శ్రీహాన్(3)ను ఢీకోట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఉదయం ఇంటి నుండి ఇద్దరు కుమారులతో వెళ్ళిన తల్లి ఒకరిని తనకళ్ళముందే కోల్పోయి రోదించిన తీరు, అక్కడ ఉన్న ప్రజలను కంటతడి పెట్టించింది. ట్రాక్టర్ ఢీకోన్న ప్రమాదంలో అభంశభం తెలియని బాబు మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు ఆలుముకున్నాయి.మృతుని తల్లి మాలతీ పిర్యాదు మేరకు కెసునమోదు చేసుకొని దర్యాప్తుచేస్తూన్నామని హత్నూర ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

## హత్య కేసులో ఐదుగురికి యావజ్జీవ కారాగారశిక్ష

### రూ.25 వేల జరిమానా

**కొండపాక, నవంబర్ 15, ప్రభాతవార్త :** హత్య కేసులో 5 గురు నేరస్తులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించడంతో పాటు రూ. 25 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పునిచి ్చనట్లు గజ్వేల్ ఏసీపీ రమేష్ తెలిపారు. మండల పరిధిలోని బందారం గ్రామానికి చెందిన ఫిర్యాదిదారుడు శ్రీనివాస్‌రెడ్డి తండ్రి యాదయ్యను నంగునూర్ మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చెట్లమైన అలియాస్ దమ్ము తిరుపతిరెడ్డి, చెట్టమైన దమ్ము పరుశురామ్, చెట్టమైన అలియాస్ దమ్ము కనకయ్య, చెట్లమైన దమ్ము మల్లయ్య, చెట్టమైన మ్యాడలవ్వలు 2017 జూలైలో వ్యవసాయ బావి వద్ద భూమి విషయంలో గొడ్డండ్లు, రాళ్లు, కట్టెలతో దాడి చేశారు. దాడిలో యాదయ్య మృతి చెందినట్లు తెలిపారు. అప్పటి కుకునూర్‌పల్లి ఎస్ఐ సంతోష్‌కుమార్ కేసు నమోదు చేయగా తొగుట సీఐ వెంకటేశం కేసు పరిశోధన చేసి నేరస్తులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అనంతరం పరిశోధన పూర్తి చేసి కోర్డులో చార్జిషిట్ దాఖలు చేసినట్లు తెలిపారు. దీంతో జిల్లా ఫస్ట్ క్లాస్ అడిషనల్ సెషన్స్ కోర్టులో కేసు విచారణ జరిపిన అనంతరం నేరం రుజువు కావడంతో 5 గురికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ న్యాయమూరి ్త తీర్పునిచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి సీపీ ఎం.రమణకుమార్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్‌లు కేసు పరిశోధన చేసిన సీఐ వెంకటేశం, కోర్టు కానిస్టేబుళ్లు బాపురెడ్డి, లావణ్య, నాగరాజు, కోర్టు లైజనింగ్ ఎఎస్ఐ స్వామిదాస్, హెడ్ కానిస్టేబుల్ రాజమల్లులను వారు అభినందించారు.

## పిడీఎస్ రేషన్ బియ్యం స్వాధీనం

**చేర్యాల, నవంబర్ 15, ప్రభాతవార్త :** ప్రభుత్వం అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచారని మంగళవారం ఉదయం పోలీసులు దాడులు చేసి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. చేర్యాల ఎస్సై భాస్కర్ రెడ్డి, టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ కథనం ప్రకారం... మండలంలోని వీరన్నపేట గ్రామ శివారులో ఉన్న శ్రీసాయి లలిత బిన్నీ రైస్ మిల్‌లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు దాడులు చేసి 35 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎవరైన కొనుగోలు చేసినా, అమ్మినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రేషన్ బియ్యం, నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

## ఎస్ఎస్‌సి, ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్**

**సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 15, ప్రభాతవార్త:** జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేకాధికారులు, విద్యార్థుల చదువు, ఆరోగ్యం, ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ పేర్కొన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్షా కో-ఆర్డినేటర్లు, కెజిబివి ప్రత్యేక అధికార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శరత్ మాట్లాడుతూ ఇటీవల నారాయణఖేడ్ కెజిబివిలో జరిగిన ఆహార కల్తీ విషయమై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇకముందూ పాఠశాలల్లో ఎటుంటి ఆహార కల్తీ జరిగినా స్పెషల్ ఆఫీసర్, సంబంధితులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార కల్తీ జరగకుండా చూడాల్సిన బాధ్యత స్పెషల్ ఆఫీసర్లదని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతిరోజు విద్యార్థుల భోజనానికి కావాల్సిన సరుకులు, కూరగాయలన్నింటికి స్వయంగా స్పెషల్ ఆఫీసర్ సమక్షంలో ఫుడ్ కమిటీ పర్యవేక్షణలోఇవ్వాలన్నారు. పాడైన సరుకులు, కూరగాయాలను ఇవ్వరాదని, అప్పటికప్పుడు మంచివి తెప్పించి ఇవ్వాలన్నారు. పాఠశాలకు వచ్చిన సరుకుల నాణ్యతలను ప్రత్యేక అధికారి పరిశీలించాలన్నారు. బియ్యంలో పురుగులు, ముక్కిపోయినవి ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారికి తెలియజేసి తిప్పి పంపి మంచి బియ్యం తెప్పించాలని కలెక్టర్ తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలన్నారు. నైట్ వాచ్మెన్ కాకుండా ఇటర్ కెజిబివిలో ముగ్గురు, మిగతా కెజిబివిలో ఇద్దరు పాధ్యాయులు రొటేషన్ పద్ధతిలో విద్యార్థులకు రాత్రి భోజనం, ఉదయం టిఫిన్ అందే వరకు ప్రత్యేక అధికారితో పాటు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సమీక్షలో డిఈఓ రాజేష్, సివిల్ సప్లైస్ డిఎం సుగుణ బాయ్, సమగ్ర శిక్షా జిల్లా కో-ఆర్డినేటర్లు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌వోసీని అందజేసిన ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

**మెదక్, నవంబర్ 15 ప్రభాతవార్త:** పలు వ్యాధుల బారిన పడి దవాఖానల్లో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందస్తున్నామని ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి అన్నారు. నిజాంపేటమండలం చల్మేడ గ్రామానికి చెందిన బి.దుర్గయ్య తండ్రి నారాయణ అనారోగ్యం బారిన పడిన విషయం మండల నాయకుల ద్వారా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలుసుకున్నారు. మోకాలు చికిత్స కోసం స్పందించి మానవతా దృక్పథంతో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ.1,00,000 ఎల్‌వోసీని మంజూరు చేయిం చారు. ఎల్‌వోసీ పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో డీసీ సీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నిజాంపేట మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, చల్మేడ ఎంపీటీసీ నంద్యాల బాల్‌రెడ్డి, తిరుమలస్వామి ఆలయ చైర్మన్ ఆకుల మహేష్, మాజీ ఉప సర్పంచి బాజ దుర్గయ్య, నగరం సర్పంచి గేమ్‌సింగ్, మెదక్ పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, నాయకులు రాగి అశోక్, లింగారెడ్డి, చింతల నర్సింలు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో బంగారు, సిల్వర్ మెడల్స్

**మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 15 ప్రభాతవార్త:** ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే పోటీల్లో మంబోజిపల్లికి చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు, సిల్వర్ మెడల్స్ సాధించారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగాయి. మెదక్‌కు చెందిన కరాటే విద్యా ర్థులు పాల్గొనగా మెదక్ మండలం మంబోజిపల్లికి చెందిన దీక్షిత్‌గౌడ్, భారత్‌గౌడ్‌లు పాల్గొని కటాస్ విభాగంలో బంగారు, వెండి పతకాలు సాధించారు. రెండవ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్‌ను మాస్టర్ కేశవరెడ్డి షోటోకాన్ కరాటే అకాడమీ వారు ఈ కరాటే పోటీలు నిర్వహించారు. పతకాలు సాధించిన విద్యార్థులకు రేన్‌జూకీ షో టోకాన్ గ్రాండ్ మాస్టర్ నగేష్, మాస్టర్ దినకర్‌లు బహుమతులను అందజేశారు.

## ప్రభుత్వ భూములను కాపాడాలి

**నర్సాపూర్, నవంబర్ 15, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, కాపాడాలని కోరుతూ మంగళవారం టిఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ ఆంజనేయులుకు విన్నవించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో ఉన్న ప్రభుత్వ భూములను కొందరు నాయకులు కబ్జా చేస్తున్నారని తెలిపారు. నర్సాపూర్ పట్టణంతో పాటు పరిసరా ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని తెలిపారు. అంతేగాక మరికొందరు పరిసరా ప్రాంతాల్లో ఉన్నచెరువుల, కుంటల నుండి అక్రమంగా మట్టిని, ఇసుకను తరలిస్తు అమ్ముకుంటున్నారని వారు ఆరోపించారు. ఇట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్‌గౌడ్, నర్సాపూర్ మున్సిఫల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షులు పంబళ్ల బిక్షపతి, కౌన్సిలర్ రాంచందర్, నాయకులు కుమ్మరి నాగేశ్, ఆంజనేయులుగౌడ్, నరేందర్‌రెడ్డి, రాకేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరక్టర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## నేవీ ఉద్యోగానికి ఎంపికైన ప్రణీత్‌ను అభినందించిన ఎమ్మెల్యే

**శివ్వంపేట, నవంబర్ 15 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో నేవీ ఉద్యోగంలో జాతీయస్థాయిలో 5వ ర్యాంకు సాధించిన శివ్వంపేట మండల పరిధిలోని చంది గ్రామానికి చెందిన గండన్నగారి సురేందర్, జ్యోతిల కుమారుడు ప్రణీత్‌ను నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు పలు గ్రామాల ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి విద్యార్థులు మంచి గుర్తింపు తేవడం గొప్పతనమని వారు అంటున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్ తదితరులు మాట్లాడుతూ ఇటువంటి విద్యార్థులు మునుముందు కూడా మంచి గుర్తింపు తీసుకువస్తూ దేశానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.

## వివాహిత అదృశ్యం

మెదక్, నవంబరు 15, ప్రభాతవార్త: బంధువులను బస్సు ఎక్కిస్తానని చెప్పి వెళ్లిన వివాహిత అదృష్టం అయిన సంఘటన చిన్నశంకరంపేట మదిర గ్రామం బాగిర్తిపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ లక్ష్మణ్ కథనం ప్రకారం.... గ్రామానికి చెందిన నరేష్ ఐదు సంవత్సరాల క్రితం తూప్రాన్ పట్టణంలోని ఒ విత్తనాల పరిశ్రమలో కూలి పనులు చేసుకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలో అక్కడే కూలీపనులు పనిచేసే కొత్తపల్లి గ్రామానికి చెందిన రజిత(24)తో పరిచయం ఏర్పడింది. 2017సంవత్సరంలో వీరు ప్రేమ వివాహం చేసుకోని గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. విరికి పిల్లలు లేరు. 13తేది ఉదయం కూలిపనులకు వెళ్లిన నరేష్ సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించలేదు. చుట్టు పక్కల వారిని అడుగగా బంధువులు వచ్చారు రోడ్డు వరకు వెళ్లి వస్తా అని చెప్పినట్లు వారు తెలిపారు. బంధువుల ఇళ్లలో గాలించిన రజిత ఆచూకి లబించలేదు. భర్త నరేష్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

## మారుమూల గ్రామాల్లో సేవలు అందిస్తాం

**శివ్వంపేట, నవంబర్ 15 ప్రభాతవార్త:** లయన్స్ క్లబ ద్వారా మారుమూల గ్రామాలకు బాలానగర్ ఎలైట్ సహకారంతో ఉత్తమ సేవలు అందిస్తున్నామని శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు లయన్ సుబ్రమణ్యం మండలంలో బాలల దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. మండల పరిధిలోని మల్లుపల్లి గ్రామంలో అక్కడి సర్పంచి గ్యాదరి భాగ్యమ్మ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. మునుముందు గ్రామాలను ఎంపిక చేసి లయన్ క్లబ్ బాలానగర్ ద్వారా సేవలు అందిస్తామని డాక్టర్ సుబ్రమణ్యం విలేకరులకు మంగళవారం తెలిపారు. ఉత్తమ సేవలు అందించేవారికి లయన్స్ క్లబ్ ద్వారా అవార్డులు అందజేస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లయన్ నరేష్, లయన్ యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు శారదా, గ్రామ పెద్దలు శ్రీనివాస్, వెంకటేష్, లయన్ గోపీనాథ్, పాండురంగం, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు ప్రభుత్వ భూములను కాపాడాలని విన్నవిస్తున్న టిఆర్ఎస్ నాయకులు

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: జడ్పీచైర్మన్

**ఘట్‌కేసర్, నవంబర్ 15, ప్రభాతవార్త:**

రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశంలో ఎక్కడా కూడా లేవని మేడ్చల్ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ రైతువేదికలో మంగళవారం ఆయన రైతు భీమా చెక్కును అందజేశారు. గ్రామానికి చెందిన రైతు రాచకట్ల రవి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. ఈమేరకు రైతుభీమా పథకం కింద ఎల్ఐసీ ద్వారా రూ.5 లక్షలు మంజూరు కావడంతో మృతుని భార్య అండాలుకు జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి చేతుల మీదుగా చెక్కు అందజేశారు. వ్యవసాయభూమి కల్గిన రైతు చనిపోతే కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం రైతుభీమా కల్పించి ఐదు లక్షలు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మండల రైతుబంధు సమితి సమన్వయకర్త కొంత ం అంజిరెడ్డి, జిల్లా ఆర్‌బిఎస్ సభ్యులు దొంకెన బిక్షపతిగౌడ్, మండల వ్యవసాయాధికారి ఎం.ఏ.బాసిత్, సర్పంచ్ కాలేరు సురేశ్, ఉపసర్పంచ్ ఉప్పు లింగేశ్వరరావు, ఏఈఓ సురేశ్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి కందుల కుమార్, గ్రామరైతుబంధు సమన్వయకర్త కొమిరెడ్డి ఇంద్రారెడ్డి, వార్డుసభ్యులు చుక్కల రాంచందర్, ఎర్రోల్ల శ్రీనివాస్, పూస నంద కుమార్, గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షులు అల్లం శంకర్, నీటిసంఘం మాజీ చైర్మన్ సింగారం సుక్కయ్య, సహకార సంఘం మాజీ డైరక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఆరుట్ల బాల్‌రాజ్, గుమ్మడి నర్సింహ్మా, ఉదారి సత్యనారాయణ, నరేశ్, కట్ట నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎదులాబాద్‌లో మృతిచెందిన రైతు రవి భార్యకు రైతుభీమా చెక్కును అందజేస్తున్న జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

# పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభలను విజయంతం చేయండి

**-పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి రాజేష్ పిలుపు**



పిడిఎస్‌యు 22వ మహాసభలను జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న పిడిఎస్‌యు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రాజేష్

**చేవెళ్ల, నవంబర్ 15, ప్రభాతవార్త**

ప్రగతిశిల ప్రజాస్వామ్య విద్యార్ది సంఘం తెలంగాణ రాష్ట్ర 22వ మహాసభలను విజయవంతం చేయాలని పిడిఎస్‌యు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రాజేష్ పిలుపునిచ్చారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలో డిసెంబంబర్ 1,2, 3వ తేదిలల్లో నిజామాబాద్‌లో నిర్వహించే పిడిఎస్‌యు 22వ మహసభలను జయప్రదం చేయాలని పోస్టర్లును విడుదల చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ గత సంవత్సరాలుగా విద్యార్థుల నాణ్యమైన హక్కులకు పాడుతున్నామన్నారు. ఉచిత నాణ్యమైన శాస్త్రీయమైన విద్యాకావాలని కామన్ విద్యావిదానం కోసం పోరాడుతుందన్నారు. ఉస్మానియా యూనివర్సీటిలో పురుదుపోసుకున్న పిడిఎస్‌యు దేశంలో, రాష్ట్రంలో విద్యారంగా అభివృద్ధి కోసం పోరాడుతూ సమాజ మార్పు కోసం నిరంతరం పరితపిస్తుందన్నారు. రోజు రోజుకు విద్యావిధానం సంతలో సరుకులాగా మార్పు చెందుతూ కార్పోరేట్ కబంద హస్తాల్లో కురుకుపోతున్నటువంటి పరిస్థితన్నారు. నిరుపేద విద్యార్దులకు నాణ్యమైనటువంటి ఉచిత నిర్భంద విద్యాహక్కులను ప్రభుత్వమే ఉచితంగా అందించాలన్నారు. విద్యార్థులు సహసభలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు జైపాల్, కార్యదర్శి శ్రీకాంత్, సురేష్, అశోక్ తదితరులు పాల్గోన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

**-తహసీల్దారు మోహన్**

**పూడూరు, నవంబర్ 15, ప్రభాతవార్త :**

బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని తహశీల్దారు మోహన్ పేర్కొన్నారు. మంగళవారం పూడూరు మండల పరిషత్తు కార్యాలయంలో తహశీల్దారు అధ్యక్షతన మండల చైల్డ్‌లైన్ అడ్వైజరీ కమటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం బాలలహక్కు వారిని పాఠశాలల్లో విద్యను అభ్యసించే విదంగా ప్రోత్సహించాలని వివరించారు. బాల్య వివాహాలు చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలపై వేదింపులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామని వివరించారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా తమకు సమాచారం అందించాలని కోరారు. అందరి సహకారంతో బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమౌతుందని పేర్కొన్నారు. బాలలకు ఎలాంటి సమస్యలు వచ్చినా 1098,100 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హరిశ్చందర్, ఎంపిడిఓ సూపరింటెండెంట్ వరలక్ష్మీ, వైద్యాధికారి సుధాకర్‌రెడ్డి. చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఎపిఎం బందయ్య, చైల్డ్‌లైన్ మండల ఇంచార్జ్ వెంకటేష్, షఫి, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.



సమావేశంలో మట్లాడుతున్న తహసీల్దారు మోహన్, పక్కన ఎంఈఓ హరిశ్చందర్ తదితరులు

# గీతకార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర గీతపనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్
- డిసెంబరు 9,10తేదీలలో ప్రతినిధుల మహాసభలు
- శామీర్‌పేటలో పోస్టర్‌ను ఆవిష్కరించిన వైనం

**శామీర్‌పేట, నవంబరు 15, ప్రభాతవార్త**

గీతకార్మికుల సమస్యల పరిష్కారం రాష్ట్ర గీతపనివారల సంఘం కృషి చేస్తుందని తెలంగాణ గీతపనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ గీతకార్మికల పనివారల సంఘంకు 65సంవత్సరాల చరిత్ర ఉందని, గీతకార్మికుల, కల్లువృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతుందని ఆయన అన్నారు. మంగళవారం శామీర్‌పేట మినీస్టేడియంలో మేడ్చల్ జిల్లా గీతపనివారల సంఘం కమిటీ సమావేశం జిల్లా గౌరవాధ్యక్షులు డిజి సాయిలుగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగ డిసెంబరు 9,10 తేదీలలో జరిగే మహాసభల పోస్టర్‌ను ఆయన విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగ జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభాకర్ మాట్లాడుతూ గీతకార్మికులు ఎదర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకోవటానికి, హక్కుల సాదన కోసం డిసెంబరు 9,10తేదీలలో మహాసభ జిల్లాలోని మేడిపల్లి మండలం ఫీర్జాదిగూడలోని బండి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తుననట్లు తెలిపారు. గీతకార్మికులు, కల్లువృత్తిదారులు అందరు పాల్గొని మహసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గీతకార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర సంఘం నుంచి ఎక్స్‌గ్రేషియా 5లక్షలు, 5ఎకరాల భూమి వనం పెంపకం కోసం, పెన్షన్ 2వేల రూపాయలు వంటి వాటిని సాధించటం జరిగిందన్నారు. వచ్చె నెలలో జరుగనున్న మహసభల్లో ఎక్స్‌గ్రేషియాను 10లక్షలకు పెంచాలని, గీతా సంఘాలకు వనం పెంపకానికి 10ఎకరాల భూమిని కేటాయించాలని, పెన్షన్ 5వేల రూపాయలు ఇవ్వాలని ఈ మహసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ వచ్చె నెలల జరగనున్న గీతకార్మికుల మహాసభలను అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వారితో పాటు జిల్లా కార్యదర్శి యాదగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.రాములుగౌడ్, ఉపాధ్యక్షులు భాస్కర్‌గౌడ్, ఆర్.వెంకటేశగౌడ్, ఎ.నిరంజన్‌గౌడ్, లింగం, బండి బాల్‌రాజ్‌గౌడ్, దూడల యాదగిరిగౌడ్, ఆర్.నర్సింలుగౌడ్, ఎం.వెంకటేశ్‌గౌడ్, వి.నాగరాజుగౌడ్, డిజి మురళీగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



శామీర్‌పేటలోని మినీ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర గీతపనివారల సంఘం జిల్లా కమిటీలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆ కమిటీ అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, పాల్గొన్న డిజి సాయిలుగౌడ్, పలువురు నాయకులు

## అంగన్‌వాడీల్లో ప్రత్యేక మరమ్మతులు చేపట్టాలి : జడ్పిటిసి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి.

**షాద్‌నగర్, నవంబర్ 15, (ప్రభాతవార్త) :**

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక మరమ్మతులు చేపట్టాలని జిల్లా స్త్రీ శిశుసంక్షేమా శాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్, కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి మంగళవారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక మరమ్మతులు చేపట్టాలని, పాఠశాలల సమయాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని, పాత విద్యుత్ స్తంభాలను మార్చాలని, అర్హులైన రేషన్ కార్డుదారులు నష్టపోకుండా అధికారులు నిర్ధారించాలని, వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని పలు అంశాలపై ఆయా శాఖల అధికారులను కోరారు. అదే విధంగా 21 ఏళ్ల లోపు వారికి మద్యం విక్రయించకుండా మద్యం దుకాణాలు నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా కట్టుబడి ఉండేలా చూసుకోవాలని ఆమె సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ సహయ సహకారాలతో మరుగుదొడ్లు నిర్మించేందుకు కృషి చేస్తున్న జడ్పీటీసీ తాండ్రవిశాలశ్రావణ్‌రెడ్డిని జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, సభలోని సభ్యులందరు అభినందిస్తూ కొనియాడారు. ఈ సమావేశంలో మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, వివిధ మండలాల జడ్పీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తలకొండపల్లి నవంబర్15, ప్రభాతవార్త : తలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం వరధాన్యం కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు తలకొండపల్లి మాజీ ఎంపిపి టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామంలో బుధవారం ఉదయం 9గంటలకు తలకొండపల్లి మండల కేంద్రంలో 10 గంటలకు, వెల్జాల్ గ్రామంలో 11గంటలకు వరి ధాన్యం కేం ద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు. మండలంలోని ఆయా గ్రామాల వరి ధాన్య రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## 20న తెలంగాణ ఉద్యమకారుల సమావేశం

**శామీర్‌పేట, నవంబరు 15, ప్రభాతవార్త**

ఈ నెల 20వ తేదీన మేడ్చల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు కెసిఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి, బిఆర్ఎస్ నాయకులు ఎండి అఫ్జల్‌ఖాన్ తెలిపారు. ఈ నెల 20వ తేదీన శామీర్‌పేటలో ఉదయం 11గంటలకు తెలంగాణ ఉద్యమకారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాన ఉద్యమకారులకు జరుగుతున్న అన్యాయాలను సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌ల దృష్టికి తీసుకవెళ్లటానికి తెలంగాణ ఉద్యమకారుల సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉన్న తెలంగాణ ఉద్యమకారులు పాల్గొనాలని ఆయన కోరారు.

## నాయిబ్రాహ్మణుల వృత్తికి ఆటంకం కలుగకుండా ప్రభుత్వం జిఓలు తీసుకరావాలి



శామీర్‌పేట మండల కేంద్రంలో నాయిబ్రాహ్మణల వృత్తికి ఆటంకం కలుగుకుండ న్యాయం చేయాలంటూ వినతిపత్రంను అంబేద్కర్ విగ్రహంకు అందజేసి నిరసనలు తెలిపిన నాయిబ్రాహ్మణల దృశ్యం

**శామీర్‌పేట, నవంబరు 15, ప్రభాతవార్త**

నాయిబ్రాహ్మణుల కులవృత్తికి పారిశ్రామిక వేత్తల నేచర్స్ సంస్థలు ఆటంకంగ మారుతున్నట్లు, వాటిని అరికట్టటానికి రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తుల వారికి అన్యాయం జరగకుండ జిఓలు తీసుకవచ్చి నాయిబ్రాహ్మణులను ఆదుకోవాలని డాక్టర్ బిఆర్ అంబేర్కర్ విగ్రహానికి వినూత్న తీరులో వినతిపత్రం అందజేసి నాయిబ్రాహ్మణులు నిరసనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చిటుకుల సత్యంనాయి, శామీర్‌పేట మండల అధ్యక్షులు ఉద్దెమర్రి కృష్ణనాయి, గోపాల్‌నాయి, రమేశ్‌నాయి, వెంకటేశ్, బిక్షపతి, అప్పలరాజు, దిలీప్, నాగేశ్, భరత్, పవన్, పలువురు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు

**-బస్తీ సంపర్క్ అభియాన్‌లో నాయకులు**



పోతరాజుగూడెంలో కేంద్రప్రభుత్వ పథకాలను తెలియజేస్తున్న బిజెపి నాయకులు

**ఘట్‌కేసర్, నవంబర్ 15, ప్రభాతవార్త:**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతో ప్రయోజనం కల్గుతుందని మేడ్చల్ జిల్లా దళితమోర్చ అధ్యక్షులు- మాజీ ఎంపిటిసి కప్పరగళ్ల కరుణాకర్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ అనుబంధ గ్రామం పోతరాజుగూడెం గ్రామంలో బిజెపి దళితమోర్చ మండల అధ్యక్షులు సంకు మల్లేశ్ ఆధ్వర్యంలో బస్తీ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. జిల్లా దళితమోర్చ అధ్యక్షులు కరుణాకర్ విచ్చేసి బిజెపి సర్కారు సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామస్తులకు తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం దళితులకు చేస్తున్న అన్యాయాలను, మోసాలను ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో మండల బిజెపి ప్రధాన కార్యదర్శి రాచకట్ల శ్రీశైలం, దళితమోర్చ నాయకులు కూరం లింగం, గ్యార చిరంజీవి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**కొందుర్గు, నవంబర్ 15, (ప్రభాతవార్త) :** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి డాక్టర్ ఆంజనేయులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ పోతురాజు జంగయ్య అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, జడ్పీటీసీ రాగమ్మలు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. మండల స్థాయి అధికారులు, తమ తమ అభివృద్ధి నివేదికలతో యుక్తంగా విధిగా హాజరు కావాలని ఆయన కోరారు. మండల ప్రాదేశిక సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి

**- మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహరెడ్డి**



క్రీడలను సందర్శించిన మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహరెడ్డి

**మేడ్చల్, నవంబర్ 15, ప్రభాతవార్త ః**

క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడుతాయని మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహరెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటిలోని చెక్‌పోస్ట్ వద్ద గల మిని స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌ను చైర్ పర్సన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి, యువకుడు క్రీడల్లో రాణించాలని, క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం ఏర్పడమే కాకుండా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు ఏర్పడుతాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారు సమాజంలో మంచి గుర్తింపు పొందుతారని అన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరు స్ఫూర్తిని కనబర్చి ఆడాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అహ్మద్ సఫీఉల్లా, ఇండస్ట్రియల్ సంఘం అధ్యక్షుడు బాసిత్, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంచందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నటుడు కృష్ణ మృతి..అభిమానుల సంతాపం



చౌదరిగూడలో కృష్ణకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న అభిమానులు

**ఘట్‌కేసర్, నవంబర్ 15, ప్రభాతవార్త:**

నటుడు సూపర్‌స్టార్ కృష్ణ మృతిచెందడంతో ఆయన అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఘట్‌కేసర్ మండలంలో మంగళవారం పలు గ్రామాల్లో కృష్ణ మరణంపై అభిమానులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కృష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో కృష్ణ చిత్రపటానికి పూలమాళలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. చౌదరిగూడలో కృష్ణ అభిమానులు రెండు నిముషాలు మౌనం పాటించి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు మంద స్వామిదాస్, మంచాల సుధాకర్, నాయకులు డానియల్, నాగేశ్, మల్లేశ్, నరేశ్, ప్రమోద్, రాజు, నరేశ్‌లు పాల్గొన్నారు. ఎదులాబాద్‌లో కృష్ణ చిత్రపటానికి ఎంపిటిసి గట్టగళ్ల రవి, సొసైటీ డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, సామల అమర్, జంగయ్య, ఓంప్రకాష్, నరేశ్‌లు నివాళులు అర్పించారు.

## జగ్గంగూడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ముహూర్తం

**శామీర్‌పేట, నవంబరు 15, ప్రభాతవార్త**

జగ్గంగూడ గ్రామపంచాయతీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంకు భూమి పూజ (ముహూర్తం) చేసినట్లు జగ్గంగూడ గ్రామ సర్పంచు సిహెచ్ విష్ణువర్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడ గ్రామపంచాయతీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగ సర్పంచు విష్ణువర్దన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ నిధులు 7లక్షల రూపాయలతో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు బుద్ది శ్రీనివాస్, కార్యదర్శి పద్మ, వార్డుసభ్యులు భూపాల్‌రెడ్డి, జహంగీర్, సాయిబాబు, నాయకులు నాగరాజు, రమేశ్, శివ, బాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నాగరాజుగుప్త, భద్రారెడ్డి, సత్యనారాయణ, జంగయ్య, మహిపాల్‌రెడ్డి, ప్రణయ్‌రెడ్డి, నాజర్, వరకాంత్‌రెడ్డి, అంజిరెడ్డి, కృష్ణరెడ్డి, బాల్‌రాజ్, పరమేశ్, పాల్గొన్నారు.



జగ్గంగూడలో గ్రామపంచాయతీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ముహూర్తం చేసిన సర్పంచు విష్ణువర్దన్‌రెడ్డి, పాల్గొన్న ఉపసర్పంచు బుద్ది శ్రీనివాస్, పలువురు వార్డుసభ్యులు, నాయకులు


పుల్‌కుర్తి కస్తూర్భాగాంధీ పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

## కస్తూర్భా ఎదుట ఉపాధ్యాయుల నిరసన

**మనూర్, నవంబరు 15, ప్రభాతవార్త:** టిపిటిఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మంగళవారం నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని కస్తూర్భా గాంధీ బాలికల విద్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని పుల్‌కుర్తి, నారాయణఖేడ్, నాగల్‌గిద్ద, సిర్గాపూర్, కంగ్టి పాఠశాలల ఎదుట సమస్యల పరిష్కారానికి నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టిపిటిఎఫ్ ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, జిల్లా కార్యదర్శులు దుర్గం నర్సింలు, నాయకులు గిర్మాజి బాబురావు, జగన్నాథం, శెంకట్ నాయక్, ప్రభాకర్, విఠల్, శేరికర్ రమేష్, ధర్మ భిక్షం, పర్శురాం, దీపక్, విజేందర్‌రెడ్డి, పి మోహన్, విజయ్‌కుమార్, ఆకుల వినయ్‌కుమార్, ఎంఏ రహీం, తవుర్య నాయక్, గోవింద్, ఎల్ శ్రీరామ్, వెంకట్‌నాయక్ రాథోడ్, ఎంఏ అయూబ్, కెజివిబి సిబ్బంది సంతోషి, వీరమణి, లలిత, జ్యోతి, స్వప్న, రజిత, విజయలక్ష్మి, జయశీల, ఉమారాణి, అన్నపూర్ణ, రేణుక, కళావతి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి చీరలు వేలం


అమ్మవారికి అలంకరించిన చీరలు వేలం వేస్తున్న దృశ్యం

**సంగారెడ్డి, నవంబరు 15, ప్రభాతవార్త:** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు ఐడిఏ బొల్లారం ఇండస్ట్రీస్ కాలనీలో నిత్యపూజలందుకుంటున్న నల్లపోచమ్మ తల్లికి అలంకరించిన చీరలను మంగళవారం వేలం పాటలు నిర్వహించారు. అమ్మవారికి అలంకరించిన చీరలను దక్కించుకునేందుకు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరకున్నారు. ఆలయంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి వేలం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొలన్ రోజాబాల్‌రెడ్డి, నాయకులు, కాలనీ వాసులు బషీర్, శ్రీశైలం, లక్ష్మి, శారద, పోచమ్మ, శాంతి, మౌనిక, శిల్ప, భవాని, రరోజా, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివి ఉద్యోగ సమస్యలను పరిష్కారించాలి


నిరసన తెలుపుతున్న టిపిటిఎఫ్ ఉద్యోగ సంఘాల నాయకులు

**కంగ్టి, నవంబర్ 15, ప్రభాతవార్త:** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టిపిటిఎఫ్ తలపెట్టిన 3 దశల ఉద్యమంలో భాగంగా కెజిబివి కంగ్టి పాఠశాలలో నిరసన, ప్రదర్శనను మంగళవారం చేపట్టడం జరిగింది. కెజిబివి ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేసి, ఉద్యమాన్ని ఉధృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్నాథం, వెంకట్, మండల అధ్యక్ష, ప్రధానాధ్యక్షులు వెంకట్ రాథోడ్, అయూబ్, సభ్యులు ధర్మ భిక్షం, కెజిబివి సిబ్బంది పాల్గొన్నారు.

## గడిపెద్దపూర్‌లో ప్రజల వద్దకే ఆర్టీసీ


మాట్లాడుతున్న ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ప్రవీణ్ కుమార్

**అల్లాదుర్గం, నవంబర్ 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గడిపెద్దపూర్ గ్రామంలో మంగళవారం నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో నుండి "ప్రజల వద్దకు ఆర్టీసీ" సదస్సును నిర్వహించారు. ఆర్ఎం సుదర్శన్ ఆదేశాల మేరకు ఈ గ్రామంలో సదస్సును నిర్వహించినట్లు తెలిపారు. గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ ఆర్టీసీపై సమస్యలు, సూచలు తెలుసుకొని, వారికి అనుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆర్టీసీని గ్రామస్తులు ఆదరించాలని ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రయాణీకులు ఆర్టీసీని అందరూ ఆదారించాలని ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం-సుఖవంతంమని ఆయన పేర్కొన్నారు. ప్రయాణీకులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి లేని ప్రమాదాలను తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. అందువలన ప్రతి ఒక్కరు ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణించాలని ఆయన కోరారు. గ్రామస్థులు, విద్యార్థులకు బస్సుల సమయవేళలు ఏమైన ఉంటే మార్పులు చేసి అందరికి అనుకులంగా, సౌకర్యంగా బస్సులను నడిపేందుకు కృషిచేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గడిపెద్దాపూర్ గ్రామ సర్పంచ్ అమ్మాయమ్మ, నాయకులు దుర్గారెడ్డి, నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మార్కెటింగ్ సెల్ ఇంఛార్జ్ పాండు, రాధాకృష్ణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివి ముందు ఉపాధ్యాయుల ధర్నా

**జహీరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త:** జహీరాబాద్ జోన్ పరిధిలోని హోతి(కె)గ్రామంలోని కెజిబివి పాఠశాల ఎదుట రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఉపాధ్యాయులు మంగళవారం ధర్నా నిర్వహించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు పద్దతిని ఎత్తేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చైల్డ్ కేర్ సెలవులను వర్తింప చేయాలన్నారు. నైట్ డ్యూటీలను రద్దు చేసి రెగ్యూల్ మానిటర్‌లను నియమించాలని హతువు పలికారు. సమస్యలను పరిష్కరించే వరకు విడతల వారిగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు రాంతీర్థ నర్సింలు, నేరడి నర్సింలు, జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు యండి రుక్మోద్దిన్, ప్రధాన కార్యదర్శి అరుణ్, మండల ప్రధాన కార్యదర్శి సంగారెడ్డి, ఫజల్, రాములు, కిష్టయ్య, నిసార్ ఆహ్మద్, కెజిబివి ఎస్ఓ హారతి, సిబ్బంది కుల్సుమ్, కీబ్రా బేగం, సల్మా, అరుణ, యాస్మిన్ బేగం, ఆస్మా బేగం, స్రవంతి, అయేషా, జీనత్ బేగం, చిట్టి తదితరులు పాల్గొన్నారు.


హోతిలో కస్తూర్భా బాలికల పాఠశాల ముందు ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

# ముదిరాజ్‌లను బిసి ఏ లో చేర్చేలా
# బిసి కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి!

### ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్వంచ నారాయణ

**సంగారెడ్డి, నవంబర్ 15, ప్రభాతార్త:** ముదిరాజ్ కులస్తులను బిసి డి నుంచి ఏ గ్రూపులోకి చేర్చేందుకు అవసరమైన ప్రక్రియను బిసి కమిషన్ వెంటనే చేపట్టాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నారాయణముదిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం జోగిపేట మండలం మాసానిపల్లి గ్రామంలో ఈ నెల 21న రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లె పల్లెకు ముదిరాజ్ జెండా-ముదిరాజ్ గుండెల్లో చైత్య ఎజెండా వాల్‌పోస్టర్‌ను, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 21వ తేదీన ముదిరాజ్ మహాసభ ఆవిర్భావం జరిగుతుందన్నారు. అదేరోజన ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి పల్లెలో ముదిరాజ్ సంఘం జెండా ఎగుర వేయనున్నామని తెలిపారు. నవంబర్ 21న ఉదయం 11 గంట లకు ప్రతి పల్లెలో ముదిరాజ్‌లు సంఘం జెండాను ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. ముదిరాజ్ లను బిసి ఏ గ్రూపులో చేర్చే విషయంలో అనుస రించాల్సి వ్యూహానికి సంబంధించి ఇటీవలే అన్ని జిల్లాల సంఘం ముఖ్యులతో ఓ సమావేశం నిర్వహించటం జరిగిందన్నారు. ఒకవేళ ముదిరాజ్‌లను బిసి ఏలో చేరిస్తే ఏ గ్రూపులో ఉన్న వారి నుంచి తీవ్ర అభ్యంతరం ఏర్పడే సందర్భంలో ఎలా ముందుకు వెళ్లాలనే విషయమై కూలంకషంగా చర్చిచటం జరిగిందని తెలిపారు. ముదిరాజ్ మహాసభ తరపున గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో పలు కార్యక్రమాలను విజయవంతంగా చేయటం జరిగిందని, అందులో భాగంగానే కోకాపేటలో ఐదెకరాల స్థలం లో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణం, మత్స్య కారులకు వేయికోట్ల బడ్జెట్‌తో 75 శాతం సబ్సిడీతో వివిధ పథకాలు అందచేయటం జరుగుతుందని తెలిపారు. మత్స్యకారుల సభ్యత్వాన్ని గణనీయంగా పెంచటం జరిగిందని, రూ.300లకోట్లతో 63వేల ద్విచక్ర వాహనాలు పంపిణీ, 18 సంవత్సరాలు నిండి ప్రతి ముదిరాజ్ బిడ్డకు మత్స్య సహకార సభ్యత్వం కల్పించే విధంగా ఆదేశాలు జారీ చేయించటం, ఐదు వందల కోట్లతో ఎక్కడాలేని విధంగారాష్ట్రంలో ఉచితంగా చెరువుల్లో చేపపిల్లలు, రొయ్యలను వదలి మత్స్యకారులకు ఉపాధి కల్పించటంలాంటి పథకాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇకపోతే వేయి కోట్లతో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అలాగే మత్స్యసంపద దోపిడీ నివారణకు మత్స్య సంరక్షణ చట్టం తేవాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ఫిషరీస్ కార్పోరేషన్ ను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ముది రాజ్ సంఘం అందోలు మండల కన్వీనర్ గంగా ధర్, ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకులు డి.బి.నాగభూషణం, చాపల వెంకటేశం, జోగిపేట పట్టణ ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి తుపాకుల సునీల్, ముదిరాజ్ సంఘం పుల్కల్, రేగోడ్, వట్‌పల్లి, అల్లాదుర్గం, వట్‌పల్లి, మునిపల్లి మండలాల అధ్యక్షులు మహేశ్, వెంకటేశం, భూమయ్య, శ్రీనివాస్, సుమన్‌లతోపాటు పుల్కల్ మండల కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.


పల్లెపల్లెకు ముదిరాజ్ జెండా వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

## అనంతగిరి భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

**చిన్నకోడూరు, నవంబర్ 15, ప్రభాతవార్త:** అనంతగిరి రిజర్వాయర్ నిర్మాణానికి విలువైన భూములు ఇచ్చిన రైతులకు ఇంత వరకు నష్టపరిహారం ఇవ్వక పోవడం సరికాదని యువజన కాంగ్రెస్ సిద్దిపేట అసెంబ్లీ కార్యదర్శి అంకర్ మధు అన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మంత్రి హరీష్‌రావుకు రైతుల మీద ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. అనంతగిరి రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు వెంటనే పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని లేనియెడల అందోళనలు చేస్తామన్నారు. 60 మంది రైతులకు నేటికి నష్టపరిహారం అందలేదని మంత్రి హరీష్‌రావు పనితీరు ఏలా ఉందో అర్థమవుతుందన్నారు. భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించని యెడల అవసరమైతే మంత్రి హరీష్‌రావు క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. నష్టపరిహారం చెల్లించే వరకు బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో బాధితులు ఎం.డి.గౌస్, తిప్పరబోయిన రాజు, గుర్రాలగొంది శ్రీనివాస్, దుబ్బుల అజయ్, దొంతి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలికి సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 15, ప్రభాతవార్త :** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్సలు చేసుకొని ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్న ఓ బాధితురాలికి ముఖ్యమంత్రి సహాయ నిధినుండి ఆర్థికసాయం అందించారు. ఝాన్సీలింగాపూర్ గ్రామానికి చెందిన కల్వల నాగమణి ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకోవడం జరిగింది. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి సహకారంతో 70 వేల రూపాయలు మంజూరు అయ్యాయి. వీటిని బాధితులకు అందజేశారు. తనకు సీఎం రిలీఫ్‌ఫండ్ డబ్బులు మంజూరు చేయించిన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో పాటు స్థానిక నాయకులకు రుణపడి ఉంటానని ఆమె పేర్కొన్నారు.

## పట్టణాభివృద్ధికి నిధుల మంజూరు హర్షణీయం

**మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 15 ప్రభాతవార్త:** మెదక్ పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రూ.35 లక్షలు మంజూరు చేయడం హర్షణీయమని మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి పట్టణంలోని 6, 9, 14, 18, 26, 28, 32వ వార్డుల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి 2021-22 సంవత్సరానికిగాను రూ.35 లక్షలు పరిపాలన మంజూరు ఇచ్చినట్లు తెలిపారు. నిధుల విడుదల పట్ల పాలకవర్గం తరఫున ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి చైర్మన్ చంద్రపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

## కమ్యూనిటీ హాల్స్ మంజూరు పట్ల హర్షం...

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 15, ప్రభాతవార్త :** మండలంలోని ఐదు గ్రామాలకు వివిధ కమ్యూనిటీ హాల్స్ మంజూరి చేయడం పట్ల టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు, ఆర్. వెంకటాపూర్ సర్పంచ్ బండారి మహేందర్‌రెడ్డి హర్షం ప్రకటించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ భవనాల మంజూరికి కృషి చేసిన మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మండల పరిధిలోని సుతార్‌పల్లికి ఎస్‌సి కమ్యూనిటీ హాల్, శివాయిపల్లికి బీసీ కమ్యూనిటీ హాల్, కాట్రియాలకు బీసీ కమ్యూనిటీ హాల్, కోనాపూర్‌కు జనరల్ కమ్యూనిటీ హాల్, పర్వతాపూర్‌కు మహిళా భవనం మంజూరి చేయడం జరిగిందన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మరియు ప్రజల తరపున ఎమ్మెల్యేకి ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.

## అదనపు బస్సుల కోసం ఆర్టీసీ చైర్మన్‌కు సర్పంచి వినతి

**మనోహరాబాద్, నవంబర్15 ప్రభాతవార్త:** మనోహరాబాద్ మండలంలో కాళ్లకల్ పరిశ్రామిక ప్రాంతంలో ఎక్స్‌ప్రెస్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, నిజామబాద్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డికి కాళ్లకల్ సర్పంచి నత్తి మల్లేష్ ముదిరాజ్ తన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కాళ్లకల్ జాతీయ రహదారిపై ఉండటంతో ప్రతినిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వందలాది సంఖ్యలో వెళ్తుంటారని, దీంతో ఉన్న బస్సులు సరిపోవడం లేదని ఆయన తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ఆయన వినతిపత్రం అందజేశారు.


ఆర్టీసీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి నత్తి మల్లేష్


తాటిపల్లిలో కెజిబివి పాఠశాల ఎదుట నిరసన చేస్తున్న దృశ్యం

## కెజిబివి పాఠశాల ఎదుట ఉపాధ్యాయుల ఆందోళన

**సంగారెడ్డి, నవంబర్ 15, ప్రభాతవార్త:** రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణలో 475 కెజిబివి పాఠశాలున్నాయని, ముఖ్యంగా ఉద్యోగ భద్రత కావాలని టిపిటిఎఫ్ నాయకులు, కెజిబివి సిబ్బంది కలిసి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్ హాజర్రై, మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే క్రమ బద్దికరిస్తు, రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి కెజిబివి ఉద్యోగినీలను, కాంట్రాక్ట్ సర్వీసుల నుండి రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగ భద్రత కల్పించాలని కొరినారు. ఈ నెల నవంబర్ 26న సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు, ఆ తర్వాత డిసెంబర్ 3న ఛలో డిఎస్సీ ముట్టడి చేస్తామని గుర్తుచేశారు. ఈ నిరసనలో లక్ష్మన్, గోపాల్, అశోక్, కమ్రుద్దిన్, దుర్గన్న, సాయిలు, గీతమాలిని, సంతోషమ్మ, సంగమని, రాణి, కెజిబివి ఉద్యోగినీలు కవిత, వాణిశ్రీ, కల్పన, రాణి, సంగీవ, శాంభావి, అంజమ్మలు పాల్గొన్నారు.

**ఖాశీపూర్ కెజిబివి పాఠశాల ఎదుట...**


సంగారెడ్డిలో కెజిబివి పాఠశాల ఎదుట నిరసన చేస్తున్న టిపిటిఎఫ్, సిబ్బంది

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబర్ 15, ప్రభాతవార్త:** మంగళవారం సంగారెడ్డి డివిజన్ కంది మండలంలోని ఖాశీపూర్ కెజిబివి పాఠశాల ముందు టిపిఎటిఎఫ్ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో కెజిబివి ఉపాధ్యాయులకు. సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని నిరసన వ్యక్తం చేశారు. కెజిబివి సమస్యలపై టిపిటిఎఫ్ పోరాటం ఆగదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, సోమశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ విజయభాస్కర్, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి జనార్దన్, సిద్దేశ్వర్, టిపిటిఎఫ్ నాయకులు వశీమ్, ప్రకాష్, అనిల్ కుమార్, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ సయ్యుబున్నిసా, ఉపాధ్యాయులు, జాయిబున్నిషా బేగం, అలియా, మంజులవాని, రఫియా సుల్తాన, మంజుల, అయేషా, తైసీం పాల్గొన్నారు.

## రాజారాం తండాలో ఎద్దుల అపహరణ

**కంగ్టి, నవంబర్ 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాజారాం తండాలో ఎద్దులు ఆదివారంరాత్రి చోరికి గురయ్యాయని యాజమాని, రైతు జాదవ్ బాబుసింగ్, తండ్రి ఠాకూర్ కంగ్టి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి ఎద్దులను కట్టివేసి నిద్రపోయారు. ఆదివారం రాత్రి 2:30 ప్రాంతంలో బాబుసింగ్ ఎద్దులను చూడగా కనిపించలేదు. వెంటనే చుట్టుపక్కలవారితో కలిసి ఎద్దులకోసం గాలింపు చేశారు. ఎద్దుల దొరకక పోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఐ వెంకటేశ్వర్లు మాట్లా దుతూ, సీసీ పుటేజ్‌లను పరిశీలించి త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు. సిఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


చోరీకి గురైన ఎద్దులు

# కెజిబివిఉద్యోగులకు బేసిక్ పేను ప్రభుత్వం వర్తింపజేయాలి

### టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్

**నారాయణఖేడ్, నవంబర్ 15 ప్రభాతవార్త:** కెజిబివి ఉద్యోగులకు బేసిక్ పేను ప్రభుత్వం వెంటనే వర్తింపచేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో కస్తూర్బాగాంధీ పాఠశాలలో సిబ్బందితో కలిసి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీటీఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగారాం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్ఓలు ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రతి ఉద్యోగులకు కొత్త పీఆర్సీ ప్రకారం బేసిక్‌పేను వర్తింపజేయాలన్నారు. మహిళా టీచర్లకు వర్తిస్తున్న 27 సెలవులు ఇవ్వాలని ప్రతి కేజీబీవీకి వార్డెన్ పోస్టులు, ఆప్షనల్ సెలవులు రెండవ శనివారం సెలవులు ప్రకటించాలని వారు కోరారు. ఉపాధ్యాయులపట్ల అధికారుల వేధింపులు నిలుపుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.


నిరసన తెలుపుతున్న టీపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

కెజీబీవీ ఉద్యోగులను కాంట్రాక్టు సర్వీసుల నుంచి రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగ భద్రత కల్పించి అందిరి ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సెలవులు, వేతన నిర్ణయాలు ప్రతిపాదించాలని వారు కోరారు. ఈనెల 26వ తేదిన జిల్లా సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ముందు వచ్చేనెల డిసెంబర్ 3వ తేదిన ఛలో డీఎస్ఈ ముట్టడి కార్యక్రమం చేపడుతామని వారు ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో బాబురావు జిల్లా కార్యదర్శి, జిల్లా కౌన్సిలర్లు ప్రభాకర్, సిహెచ్. విఠల్, నారాయణఖేడ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరశురాం, దీపక్, కెజిబీవీ ఉద్యోగినులు స్వప్న, అన్నపూర్ణ, ఉమారాణి, సుజాత, కళావతి పాల్గొన్నారు.


సూపర్‌స్టార్ కృష్ణకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## సూపర్‌స్టార్ కృష్ణకు ఎమ్మెల్యే నివాళులు

**పటాన్‌చెరువు, నవంబరు 15, ప్రభాతవార్త:** అనంతలోకాలకు చేరిపోయిన సినీ హీరో సూపర్ స్టార్ క్రిష్ణకు పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మంగళవారం నివాళులర్పించారు. క్రిష్ణ అభిమాని అయిన ఎమ్మెల్యే పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రిష్ణ మరణం సినీ రంగానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో కార్పోరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, గుమ్మడిదల జడ్పీటిసి కుమార్‌గౌడ్, మాజీ ఎంపిపి అధ్యక్షులు యాదగిరియాదవ్, మాజీ కార్పొరేటర్, కృష్ణ అభిమాన సంఘం నాయకులు శంకర్‌యాదవ్, ఎట్టయ్య, వెంక టేశ్, లక్ష్మీనారాయణ, రాజు, టిఆర్ఎస్ జిన్నారం, గుమ్మడిదల మండలాల అధ్యక్షులు రాజేష్, షేక్‌హుస్సేన్, నాయకులు విజయ్‌భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కొత్వాల్ పాఠశాలలో బాలల దినోత్సవం

**కంది, నవంబరు 15, ప్రభాతవార్త:** మండలంలోని కొత్వాల్ పాఠశాలలో సోమవారం బాలల దినోత్సవ కార్యక్రమాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. నెహ్రూ చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగు దుస్తులను ధరించి అందంగా ముస్తాబయి పాఠశాలకు చేరుకోవడం, చిన్నారులు ఆనందోత్సవాలతో పాఠశాల ఆవరణలో చిందులు వేయడంతో పండగ వాతావరణం కానవచ్చింది. కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్ జీనత్, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఫర్నిచర్ అందచేత

**సంగారెడ్డి, నవంబరు 15, ప్రభాతవార్త:** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలకు నికోమాక్ పరిశ్రమ ఎండి థకుయా మోరి రూ. 5 లక్షల విలువగల ఫర్నిచర్‌ను మంగళవారం అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొలన్ రోజా, మాజీ జడ్పీటిసి సభ్యులు కొలన్ బాల్‌రెడ్డి, నికోమ్యా పరిశ్రమ సిబ్బంది అరిసాకా టేట్‌సురా, సి రమేష్, ఎఆర్ఎం రెడ్డి, యం రమేష్, కె జైపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ పూలే సేవా సమితి రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

**నారాయణఖేడ్, నవంబర్ 15 ప్రభాతవార్త :** అంబేద్కర్ పూలే సేవా సమితి రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని వికారాబాద్ జిల్లా తాండూరులో సమావేశం జరిగింది. ఈ కార్యవర్గ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.రాములు అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంబేద్కర్ పూలే సేవా సమితి రాష్ట్ర అంబేద్కర్ పూలేసేవా సమితి అధ్యక్షులుగా అబ్దుల్ రహీమ్, ఉపాధ్య క్షులుగా షేక్‌నిజామొద్దిన్, అమృత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వై.పండరీ, కార్యదర్శిగా ఆర్.రాములు, కోశాదికారిగా నమిమొద్దిన్,, కార్యవర్గ సభ్యులుగా బైండ్ల కృష్ణ ఆకుల రవి, మొహమ్మద్, జమీర్, నర్సింహ, సంజీవయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు జిల్లాల, మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ బాసిత్‌కు సేవా రత్న అవార్డు



న్యూఢిల్లీలో సేవారత్న అవార్డు అందుకుంటున్న అబ్దుల్ బాసిత్

**పటాన్‌చెరువు, నవంబరు 15, ప్రభాతవార్త:** జర్నలిస్టు,సంఘ సేవకులు అబ్దుల్ బాసిత్‌కు సేవా రత్న నేషనల్ అవార్డ వరించింది. నవంబరు 13న న్యూఢిల్లీలో జరిగిన ఆలిండియా బహుజన రైటర్స్ మూడవ నేషనల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు సుబ్రహ్మణ్యంలు బాసిత్‌కు అవార్డును అందచేశారు. భారత దేశంలోని 26 రాష్ట్రాలకు చెందిన 1వేయి మంది ప్రతినిధులు పాల్గొన్న కార్యక్రమంలో ఢిల్లీలోని కరోల్ భామ్ ఎమ్మెల్యే విశేష్ రవి, రాష్ట్ర అధ్యక్షులు పచ్చ, నేషనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం విజయ లలిత, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎం గౌతమ్, సంపత్ ముక్కెర తదితరులు పాల్గొన్నట్లు బాసిత్ పేర్కొన్నారు.

## లక్ష్యాలు ఎంచుకుని చదివితే ఉన్నతస్థాయికి ఎదుగుతారు

**సంగారెడ్డి, నవంబర్ 15, ప్రభాతవార్త:** విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని చదివితే ఉత్నతస్థాయికి ఎదుగుతారని ప్రిన్సిపల్ అడవి రాజు అన్నారు. జోగిపేటలోని కళాశాలలో మంగళవారం గెట్ టు గెదర్ పార్టీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్బంగా అడవి రాజు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు విద్యాబోధనతో పాటుగా ప్రతి సంవత్సరం కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ పరిచయ కార్యక్రమం ద్వారా నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు కళాశాల వాతావరణానికి, అధ్యాపకులు, ఇతర విద్యార్థులతో సత్ సంబంధాలు ఏర్పడతాయని, విద్యార్థులు సీనియర్, జూనియర్ అనేటువంటి తారతమ్యం లేకుండా ఉంటుందని, ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ లలిత, అకాడమిక్ కో-ఆర్డినేటర్ ఏ గోపాల్, అధ్యాపకులు, అనసూయ, సుప్రియ, సంధ్యా, అధ్యాపకులు, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

## జడ్పీటిసిని పరామర్శించిన కాంగ్రెస్ నేత

**నాగల్‌గిద్ద, నవంబరు 15, ప్రపభాతవార్త:** మాతృమూర్తిని కోల్పోయిన జడ్పీటిసి సభ్యులు రాజ్‌రాథోడ్‌ను టిపిసిసి సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మంగళవారం పరామర్శించారు. కిషన్‌నాయక్ తండా ఏకగ్రీవ సర్పంచ్ జడ్పీటిసి సభ్యులు రాజ్ రాథోడ్ మాతృమూర్తి దేవులబాయి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. సర్పంచ్ మృతి చెందినట్ల తెలుసుకున్న చంద్రశేఖర్‌రెడ్డి కిషన్‌నాయక్ తండాకు చేరుకుని దేవులాబాయ్‌కి నివాళులు అర్పించి రాజ్ రాథోడ్‌కు సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో కారాముంగి, జనవాడ సర్పంచులు గుండెరావుపాటిల్, అనిల్ పాటిల్, నాయకులు అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

## వైభవంగా ఆలయ వార్షికోత్సవం

**మెదక్, నవంబర్ 15, ప్రభాతవార్త:** దైవచింతనతోనే మనఃశాంతి లభిస్తుందని తోగుట పీఠాధిపతి మాదవనంద సరస్వతి తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయ 11వ వార్షికోత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతి విరుద్దంగా మానవుడు ఎలాంటి పనులను చేపట్టరాదన్నారు. ఆలయాలలో దూప,దీప నైవేద్యాలు అనివార్యం అని అన్నారు. వార్షికోత్సవాలలో భాగంగా నవగ్రహ పూజ, రుద్రాభిషేకం, గణపతి పూజ, హోమం, అన్నదానవంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి రమణ, పండితులు అనిల్‌కుమార్‌శర్మ, రామశర్మ, సాయి శర్మ, రవిచంద్ర శర్మ పాల్గొన్నారు.


హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు